# మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manananationalistvoice.com epaper.manananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 152 | 30 గురువారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


## బెంగాల్లో ముగిసిన రెండోదశ పోలింగ్

**90శాతం దాటిన పోలింగ్**

**మరింత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడి**

**మళ్లీ తమదే అధికారం అన్న మమతా బెనర్జీ**

**కోల్‌కతా,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**



పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ముగిసింది. 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే 6 గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఈసీ కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చేటు చేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మెరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా మొదలైంది. పలుచోట్ల బిజెపి, టిఎంసి కార్యకర్తలు ఘర్షణలకు దిగారు. అయితే సిఆర్‌పిఎఫ్ పోలీసులుఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పెద్దగా ఘర్షణలు చోటు చేసుకోలేదు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటేశారు. ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్‌లో పాల్గొన్నారు. కాగా, పోలింగ్ పూర్తయిన వెంటనే టీఎంసీ గెలుపుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం బీజేపీ బెంగాల్‌లో ఓటమి చవిచూడనుందని, మూడింట రెండు వంతుల మెజారిటీతో టీఎంసీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు.

## దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

**దేశంలో బిజెపి కులమతాల పిచ్చి రేపుతోంది**

**పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు.

## తమిళనాట మళ్లీ డిఎంకెదే అధికారం

**విజయ్ పార్టీ ప్రభావం స్వల్పమే**

**విపక్షానికే పరిమితం అవుతున్న అన్నడిఎంకు కూటమి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**

తమిళనాడులో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే మరోసారి సత్తా చాటబోతోందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. ముక్కోణపు పోరులో స్టాలిన్ నేతృత్వంలోని కూటమి విజయ దుందుభి మోగించనుందని అంచనా కట్టాయి. భాజపాతో జట్టుకట్టి బరిలో దిగిన అన్నాడీఎంకేకు మరోసారి నిరాశ తప్పదని సర్వేలు అభిప్రాయపడ్డాయి. సినిమాల నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ పార్టీ టీవీకేకి రెండంకెల సీట్లు రావొచ్చని, అయితే, మూడో స్థానానికే పరిమితమని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. 234 స్థానాలకు గానూ ఏప్రిల్ 23న తమిళనాడులో పోలింగ్ జరిగింది. అధికారం చేపట్టాలంటే 118 స్థానాలు అవసరం. మెజారిటీ సర్వేలు డీఎంకే అధికారం రావొచ్చని అంచనా వేశాయి. అయితే ఎన్డీటీవీ- యాక్సిస్ మైఇండియా కలిసి నిర్వహించిన సర్వే మాత్రం విజయ్ నేతృత్వంలోని టీవీకేకు అందరి కంటే ఎక్కువ స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. జేవీసీ అనే సర్వే సంస్థ అన్నాడీఎంకే కూటమికి అధికారం రావొచ్చని అంచనా వేసింది. మే 4న తుది ఫలితాలు వెల్లడి కానున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అధికార ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్, భాజపా కూటమి మరోసారి అధికారంలోకి రావొచ్చని పలు సర్వేలు అభిప్రాయపడ్డాయి. 30 స్థానాల్లో ఎన్నికలు జరగ్గా.. మెజారిటీ సర్వేలు ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి వైపు మొగ్గుచూపాయి. కాంగ్రెస్, డీఎంకే కూటమి రెండో స్థానానికి పరిమితం కానున్నాయి.



## ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు

**- ప్రతిపాదనలు సిద్ధం చేశాం - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం మీడియాతో మాట్లాడారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా నాలుగు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెచ్చారని వివరించారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యో ఖర్చు, అనుకూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరగనున్న సమిక్షా సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్పీటీ టెస్టులు నిర్వహించాలి.

## అధికారం రావడం.. పోవడం రొటీన్ వ్యవహారం



**హామీలు గుప్పించి..ప్రజలను మోసం చేస్తున్న రేవంత్**

**కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కెసిఆర్ ఆనాడే హెచ్చరించారు**

**రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**

అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు.



## ఐదు రాష్ట్రాల్లో విజయంతో హ్యాట్రిక్

**బెంగాల్లో ఓటింగ్ పెరగడం**

**ప్రజల ఉత్సాహానికి సంకేతం**

**బెంగాల్లో బిజెపి అధికారంలోకి రాబోతోంది**

**మే4న ఫలితాలతో ఇది రూఢీ కానుంది**

**గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన**

**ప్రధాని మోడీ**

**లక్నో,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, గత ఎన్నికల తరహాలో కాకుండా ఎలాంటి భయాలు లేని వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది సంకేతమని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రజలంతా ఉత్సాహంతో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మే 4న ఐదు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచి హ్యాట్రిక్ సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హోర్దోయిలో 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే'ను ప్రధాని బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బెంగాల్‌లో జరుగుతున్న పోలింగ్‌ను ప్రస్తావించారు. 'బెంగాల్‌లో ప్రస్తుతం రెండో విడత పోలింగ్ జరుగుతోంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్టు తెలుస్తోంది.

## తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి కార్యాచరణ

**150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు**

**ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం**

**అధికారలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**కిషన్‌రెడ్డితో మాట్లాడి మహారాష్ట్రను ఒప్పించాలి**

**ఉత్తమ్‌ను ఆదేశించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్)**



తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని సిఎం అన్నారు. ఒకవేళ ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ బ్యారేజ్‌పై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు. ఇక్కడి నుంచి నీళ్లు తరలించడం సులవుగా ఉంటుందని అన్నారు. నీటి లభ్యత కూడా ఎక్కువేనని అన్నారు. అయితే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

# నిజాయితీని చాటుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

## - పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను యజమానికి అప్పగింత

**బాపట్ల : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్) :**

విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు మానవత్వాన్ని,నిజాయితీని చాటుకుని ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ అందరి ప్రశంసలు అందుకున్నారు.బుధవారం మధ్యాహ్నం బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పీ.కృపా కుమార్ రెడ్డికి రోడ్డుపై ఒక ఖరీదైన సెల్ ఫోన్ లభించింది.వెంటనే స్పందించిన ఆయన,ఆ ఫోన్ ద్వారా సంబంధిత యజమానిని సంప్రదించి సమాచారం అందించారు.అనంతరం గడియార స్తంభం వద్దకు ఆ ఫోన్ యజమానిని పిలిపించి,ఫోన్ ను సురక్షితంగా అందజేశారు.తన విలువైన వస్తువును తిరిగి పొందిన సెల్ ఫోన్ యజమాని కానిస్టేబుల్ నిజాయితీకి ముగ్ధులై హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.విధి నిర్వహణలో ఉంటూనే తోటి పౌరుల పట్ల బాధ్యతగా వ్యవహరించిన కృపా కుమార్ రెడ్డి ను ఉన్నతాధికారులు,సామాన్య ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని,గౌరవాన్ని పెంచుతాయని పలువురు కొనియాడారు.



# కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో 100% శాతం..

**దేవరకద్ర : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

మండల పరిధిలోని డోకూరు గ్రామ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ఇటీవల రాయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము బుధవారం 10వ తరగతి పరీక్షలు ఫలితాలను వెల్లడించింది. ఇందులో భాగంగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 100% రిజల్ట్ వచ్చినట్లు ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. జ్యోతి కి 600 మార్కుల గాను 550 మార్కులు ఫస్ట్ వచ్చినది. వైష్ణవికి 600 మార్కుల గాను 519 మార్కులతో సెకండ్ ర్యాంకు వచ్చినట్లు ఆమె తెలిపారు.








# పదవ తరగతి ఫలితాలలో లో డోకూర్ విద్యార్థుల ప్రతిభ..

**దేవరకద్ర : ఏప్రిల్ 29, ( నేషనలిస్ట్ వాయిస్)**

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డోకూరు విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో 96% ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బలరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.51 మంది విద్యార్థులకు గాను 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగినది హరి ప్రియ 485 మార్కులతో మరియు సంగీత 481 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.ప్రధానోపాధ్యాయులు బలరాం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులనుఅభినందించారు.






# రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

సహకార సంఘాలు రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేయాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సహకార సంఘం నూతన పాలక వర్గం బుధవారం పదవి బాధ్యతలు చేపట్టింది. త్రిసభ్య కమిటీ చైర్మన్ గా సిద్ధ వీర్రాజు, సభ్యులుగా కేశవ భట్ల విజయ్, అత్తిలి బాబి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, వాటి ఫలితాలు రైతులకు పూర్తిగా చేరే విధంగా కృషి చేయాలని సూచించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు ఎన్నో కష్టాలకు గురయ్యారని విమర్శించారు. వ్యవసాయం లాభసాటిగా ఉండే విధంగా రైతులకు పూర్తి సహకారం అందించాలన్నారు. జనసేన సిద్ధాంతాలను, ఆశయాలను సాధించేందుకు అంకితభావంతో కృషిచేసే జనసైనికులకు సముచిత స్థానం ఉంటుందని వివరించారు. సొసైటీ నూతన చైర్మన్ సిద్ధ వీర్రాజు మాట్లాడుతూ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిరంతరం రైతుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేస్తామని తెలిపారు. మాపై ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ఇచ్చిన ఈ పదవిని వమ్ముచేయకుండా రైతు సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలియజేశారు. సొసైటీ వ్యాపార సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న రూ.60 కోట్ల నుంచి రెట్టింపు అయ్యేవిధంగా కృషి చేస్తామని వివరించారు. ముందుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సునీల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## - డిప్యూటీ ఎంపీడీవో ముప్పిడి వెంకటేషు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో ముప్పిడి వెంకటేషు సూచించారు.తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానుసారం బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామం నుంచి ఉప్పరగూడెం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను, చెత్తాచెదారంతో పాటు ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేశారు. తొలగించిన చెత్తను ఆటో రిక్షాపై వేసుకుని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేషు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందుకు గ్రామ ప్రజానీకం పూర్తి సహకారం అందించాలన్నారు. ఇళ్లలోని వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని రోడ్లపైన, డ్రైనేజీల్లోను, ఎక్కడబడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డుల్లోనే వేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.ఫణి కుమార్ , సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# ఒంటరి మహిళ కేసును 15 రోజుల్లోనే ఛేదించిన పట్టణ పోలీసులు

## - వివరాలు వెల్లడించిన డీఎస్పీ విశ్వనాథ్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లికి చెందిన ఒంటరి మహిళ పెరుమాళ్ళ నాగమణి (76) అనుమానస్పద కేసును 15 రోజుల్లో తాడేపల్లిగూడెం పోలీసులు ఛేదించారు. స్థానికపట్టణ పోలీస్ స్టేషన్ లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ విశ్వనాథ్ కేసు వివరాలు వెల్లడించారు.ఏప్రిల్ 14న బంగారం కోసం పెరుమాళ్ళ నాగమణిని నిందితుడు దగ్గుపల్లి ప్రసాద్హత్య చేశాడని తెలిపారు. నిందితుడి దగ్గరి నుంచి రూ 3 లక్షల 45 వేలు విలువైన 36 గ్రాముల బంగారం, 3,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.అప్పుల భారం ఉండడంతో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారం దోచుకోవడానికి దగ్గుపల్లి ప్రసాద్ ప్రణాళిక రచించి హత్య చేశాడని తెలిపారు. ఈ కేసును సవాలుగా తీసుకుని15 రోజుల్లోనే ఛేదించిన పోలీసులకు రివార్డ్ అందజేసారు. అనుమానస్పద వ్యక్తులను ఇంట్లోకి అనుమతించకుండా జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ విశ్వనాథ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు బాదం శ్రీనివాస్, పి.నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మే 3 న జరిగే ' చలో ఆకివీడు ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

## - బీఎస్పీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గుదే రాజారావు

**బాపట్ల : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్) :**

మే 3 న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ' చలో ఆకివీడు ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ బీఎస్పీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గుదే రాజారావు కోరారు.బుధవారం బాపట్ల పట్టణంలో ' చలో ఆకివీడు ' కార్యక్రమ పోస్టర్ లను బీఎస్పీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.....ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులు,దళిత క్రైస్తవులు,ముస్లిం సమాజంపై జరుగుతున్న దాడులకు నిరసనగా,అలాగే ఆకివీడులో గొంతాలమ్మ గుడి నిర్మించాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మే 3 వ తారీఖున జరగనున్న ' చలో ఆకివీడు ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.కూటమి ప్రభుత్వం చర్చిలకు,పాస్టర్ లకు ఇస్తున్న లీగల్ నోటీసులను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దుచేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని దళిత క్రైస్తవుల రక్షణకై లక్షలాదిగా ప్రజలు ఆకివీడు చేరుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల సంగీతరావు,ఉపాధ్యక్షులు శివ ప్రసాద్,కార్యదర్శి నల్లమోతు శామ్యూల్ జాన్సన్,మహిళా కో - కన్వీనర్ షేక్.ఆసిఫా,శీలం రోజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# రీజెన్సీ సిరామిక్ వ్యవస్థాపకుడు జీఎన్ నాయుడు కన్నుమూత

**యానాం,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు(87) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. 1983లో రీజెన్సీ సెరామిక్స్‌ను జీఎన్ నాయుడు ప్రారంభించారు.యానాంలోని రీజెన్సీ సెరామిక్స్ కంపెనీలో గతంలో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. 2012 జనవరిలో కార్మికులు తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఆ సమయంలో కార్మిక సంఘం నాయకుడి మృతితో మిగతా కార్మికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ప్లాంట్‌లోకి ప్రవేశించి పెను విధ్వంసం సృష్టించారు. పరిశ్రమలోని వాహనాలు, యంత్రాలకు నిప్పు పెట్టి ధ్వంసం చేశారు. కంపెనీ రికార్డులను తగలబెట్టారు. ఈ ఘటనలో రీజెన్సీ కంపెనీ ప్రెసిడెంట్ కేసీ చంద్రశేఖర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాత్మక ఘటన కారణంగా రీజెన్సీ సెరామిక్స్ కంపెనీ లాకౌట్ ప్రకటించింది. దాదాపు దశాబ్దం పాటు మూతపడిన ఈ కంపెనీని 2024లో తిరిగి పునరుద్ధరించారు.

# తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో ఘన విజయం

## జిల్లాలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సొంతం

**తూప్రాన్, ఏప్రిల్, 29. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

మెదక్ జిల్లా తూప్రాన్‌లోని శ్రీ చైతన్య పాఠశాల మరోసారి తన విద్యా ప్రామాణికతను చాటుతూ పదవ తరగతి (గూజ) ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది. ఈ ఏడాది విడుదలైన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి, రెండవ ర్యాంకులను కైవసం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి ఎం. అద్వైత 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంక్ దక్కించుకోగా, వి. రుషిక్ 600లో 585 మార్కులు సాధించి సెకండ్ ర్యాంక్ సాధించారు. ఈ ఇద్దరు విద్యార్థుల విజయంతో పాఠశాల ప్రతిష్ట మరింత పెరిగింది. అంతేకాకుండా, ఈ విద్యా సంవత్సరంలో శ్రీ చైతన్య పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణంగా నిలిచింది. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాల నిర్వహణ, బోధన ప్రమాణాలు ఎంత ఉన్నతంగా ఉన్నాయో మరోసారి రుజువైంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కొంపల్లి జోన్-1 ఏజీఎం జి.వి. రమణా రావు గారు ముఖ్య అతిథిగా హాజరై విజేత విద్యార్థులను అభినందించారు. జోనల్ కోఆర్డినేటర్ రవి గారు, అసోసియేట్ కోఆర్డినేటర్ సోమేష్ గారు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ, "మా విద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలు వారి కష్టపడి చదివిన శ్రమకు, ఉపాధ్యాయుల అంకితభావానికి, తల్లిదండ్రుల నిరంతర సహకారానికి ప్రతిఫలం. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో మరింత ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేస్తాము" అని తెలిపారు. అకాడమిక్ డీన్ అశోక్ రెడ్డి గారు మాట్లాడుతూ, పాఠశాలలో అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన బోధన విధానం, నిరంతర పరీక్షలు, ప్రత్యేక శిక్షణ తరగతులు విద్యార్థుల విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజేతలను ఘనంగా అభినందించారు. విద్యార్థుల విజయోత్సాహం, తల్లిదండ్రుల ఆనందం, ఉపాధ్యాయుల గర్వభావం ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి. మొత్తంగా తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాల సాధించిన ఈ ఘన విజయం మెదక్ జిల్లా విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుత ఫలితాలతో మరిన్ని విజయ గాథలు సృష్టించాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# నిబంధనల ప్రకారమే గృహ నిర్మాణాలు

## గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్):**

అనుపురెడ్డిపల్లి మండలం పెంట్ల గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 46 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా అందులో 13 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెంట్ల గ్రామంలో తాటి లక్ష్మి లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారుతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్):**

అన్నపరెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత బుధవారం ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చరైజింగ్ యంత్రం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని ప్రతి నమోదు ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసి ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం పెంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

# 10 ఫలితాల్లో శ్రీ రాగా స్కూల్ ప్రభంజనం

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్):**

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ రాగా స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారనీ స్కూల్ యాజమాన్యం నిర్వాకులు మల్లారపు వర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. బి.అఖిల్-- 560 మార్కులు, రిషిత్ రాణా-- 532 మార్కులు, టీ.హేమంత్ నాయక్--519 మార్కులు, డి.శ్రీ చైతన్య--505 మార్కులు, ఎస్.కె ఆజ్మిల్--500 మార్కులు. సాధించారు. బోర్డు పరీక్షకు అటెండ్ అయిన వారు 30 మంది పాస్ అయ్యారు. 100 పర్సెంట్ ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ ఎం. కవిత తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు శ్రీ రాగా స్కూల్ యొక్క నాణ్యమైన విద్యా ప్రమాణాలను కృషిని ప్రతిబింబిస్తున్నాయి. టాప్ స్కోర్లు సాధించి పాఠశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ విజయానికి తోడ్పడిన శ్రీ రాగా టీచింగ్ నాన్-టీచింగ్ సిబ్బందికి, అలాగే తమ పిల్లల విద్యాభివృద్ధికి నిరంతరం సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ యాజమాన్యం అభినందనలు తెలిపింది.




## ఎస్ఎస్సి 2026 ఫలితాలలో సుజాత విద్యానికేతన్ 100% ఫలితాలతో ప్రభంజనం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ హసన్ పర్తి పాఠశాలలో 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించినది. పాపిశెట్టి వర్షిని 557/600 మార్పులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినది 10వ తరగతి రాసిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించినారు 9 మంది విద్యార్థులకు 500 కు పైగా మార్కులు వచ్చాయి. వి.వరుణ్ సాయి 546/600, పి. అఖిల్ 545/ 600, ఎం. రితిక 539/600, ఏ. ఈశ్వర్ 531/ 600, ఎం. దీపక్ 530/ 600, సిహెచ్. లక్ష్మీ శరణ్య 525/ 600, టి. రితిక 525/ 600, బి హవీలా 500 బై 600 మార్కులు సాధించినారు. 557/ 600 మార్పులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన పి. వర్షిని ను పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ, వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ అభినందించినారు.



పాపిశెట్టి వర్షిణి
557/600

# మే డే విజయవంతానికి కార్మికులు సిద్ధం కావాలి

**ఏర్గట్ల ఏప్రిల్ 29 నేషనలిస్ట్ వాయిస్ (ప్రతినిధి)**

ఏర్గట్ల, : మే డే 140వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి.కిషన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. మే 1న జరిగే కార్యక్రమాలకు రైతు కూలీలు, కార్మికులు, కర్షకులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దయాల్ సింగ్, గంగన్న, లక్ష్మి, రాజమణి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# ఏర్గట్లలో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల సత్తా

**ఏర్గట్ల ఏప్రిల్ 29 నేషనలిస్ట్ వాయిస్ (ప్రతినిధి)**



జె వైష్ణవి 541 మండల ద్వితీయ స్థానం (ఏర్గట్ల జెడ్పీహెచ్ఎస్)



ఎండీ రింషా 558 మండల ప్రథమ స్థానం (తడపాకల్ జెడ్పీహెచ్ఎస్)

పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఏర్గట్ల మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలో మొత్తం 158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో 156 మంది ఉత్తీర్ణత సాధించి 98.7 శాతం ఫలితాలు నమోదయ్యాయని మండల విద్యాశాఖాధికారి ఆనంద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో తడపాకల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి ఎండీ రింషా 558 మార్కులు సాధించి ప్రథమ స్థానం దక్కించుకోగా, ఏర్గట్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జె. వైష్ణవి 541 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. మండలంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో ఉత్తీర్ణత శాతం పెరగడం పట్ల విద్యాశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఇసుక కొరకు చెక్ డ్యాం కూల్చి వేతకు యత్నించిన వ్యక్తులు.. అడ్డుకున్న రైతులు..

**దేవరకద్ర : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

అక్రమంగా అడ్డదారులతో ఇసుక రవాణా చేయడానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో ఉన్న చెక్ డ్యామ్ ను కూల్చివేయడానికి ప్రయత్నించగా కొందరు రైతులు దీనిని పసిగట్టి అడ్డుకున్నారు. దేవరకద్ర మండలం బస్వాపూర్‌లో చెక్ డ్యాంను కుల్చేయడానికి యత్నించిన ఇసుక మాఫియా అని రైతులు తెలిపారు. చెక్ డ్యామ్ లో నీళ్ళు నిలవడంతో ఇసుక తీయడానికి రావట్లేదని అరాచకం చేయడానికి ప్రయత్నించారని రైతులు ఆరోపించారు.అర్ధరాత్రి సమయంలో హిటాచితో చెక్ డ్యామ్ ను ధ్వంసం చేస్తుండగా అది చూసి అడ్డుకున్న రైతులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ నుంచి హిటాచితో పాటు ఇసుక మాఫియా వారు పరారయ్యారు.చెక్ డ్యాం పైన భాగాన్ని కూల్చడంతో కిందికి నీళ్లు వెళుతున్నాయని రైతులు తెలిపారు. అధికారులు కూడా ఇసుక రవాణా చేసే వారికి వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. ఇక ముందు కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని రైతులు హెచ్చరించారు.





# మేడే అమరవీరుల స్ఫూర్తితో లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు పోరాటాలు ఉధృతం

## -సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్-సీఐటీయూ ఆధ్వర్యంలో మే 1 నుండి 7 వరకు ఘనంగా వారోత్సవాలు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 29( నేషనలిస్ట్ వాయిస్):**




కొత్తగూడెం పట్టణ వ్యాపితంగా కార్మిక ప్రాంతాల్లో మేడే సందర్భంగా ఘనంగా ఎర్రజెండాలు ఎగురవేయాలని కార్మిక వర్గానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం మంచికంటి భవన్ లో బుధవారం పట్టణ సీఐటీయూ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో మే ఒకటి నుండి ఏడవ తారీఖు వరకు కార్మిక వారోత్సవాలు పని ప్రాంతాల్లో కార్మిక నివాస ప్రాంతాల్లో వాడవాడల ఎర్రజెండా రెపరెపలాడాలని ఆయన పిలుపునిచ్చారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్న చరిత్రను ప్రతి కార్మికుడు తెలుసుకోవాలని గత కార్మిక వర్గ పోరాటాల చరిత్రను అధ్యయనం చేసి ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను కార్మికుల్లో ప్రచారం చేయాలని కార్మికులకు పెను ప్రమాదంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలకు పూనుకోవాలని సూచించారు. ప్రజల్ని కార్మికుల్ని చైతన్యపరిచే ఆట పాటలు మహిళలు ప్రత్యేకమైన కార్యక్రమాలు విద్యార్థులకు యువతకు ఉత్తేజము కలిగేలా అమరవీరుల వారసత్వాన్ని ఉనికిపుచ్చుకునేలా నేటి యువతరాన్ని కార్మికులకు అండగా నిలబడేలా మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమాలకు కార్మికులు కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనే విధంగా చేస్తున్నామన్నారు. మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ బీజేపీ మోడీ విధానాలను మతోన్మాద విధానాలపై ఈ సభల్లో కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకవర్గాలకు బుద్ధి చెప్పేలా మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు అంబాలదుర్గమ్మ, సీనియర్ నాయకులు జి రాజారావు, జలాల్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు సామ్యూల్, రఫీ, టీ ఎం ఎస్ ఆర్ యు నాయకులు రమేష్, స్కావెంజర్స్ యూనియన్ పట్టణ

# రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## - పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు





**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆదేశించారు. పట్టణంలోని 32వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. వార్డులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, డ్రైనేజీలో మురుగు నిల్వ లేకుండా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. వర్షాకాలంలోపు డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

అనంతరం వార్డులో నిర్మాణంలో ఉన్న నూతన స్విమ్మింగ్ పూల్ పనులను కమిషనర్ పరిశీలించారు. "శ్రీ బోలిశెట్టి శ్రీనివాస్" పేరుతో నిర్మిస్తున్న ఈ స్విమ్మింగ్ పూల్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని గుత్తేదారులకు, సిబ్బందికి స్పష్టం చేశారు. వార్డు అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని కమిషనర్ ఏసుబాబు వివరించారు.

# వేటపాలెంలో భార్యభర్తలు ఆత్మహత్య

## - అనాధగా మిగిలిన 13 నెలల పసికందు

**బాపట్ల : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్) :**



బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రావూరుపేట ఆర్యవైశ్య వీధిలో బుధవారం భార్యభర్తలు ఆత్మహత్య సంచలనంగా మారింది.బుధవారం మధ్యాహ్నం మాజేటి ప్రభాకర్ ( 33 ),పార్వతి ( 24 ) ఆత్మహత్య చేసుకున్నారు.మృతురాలు పార్వతి మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ప్రక్క ఇంటి వాళ్లకు పాపను చూడమని అప్పగించినట్లు చెబుతున్నారు.మృతుడు ప్రభాకర్ ఎంబీఏ పూర్తి చేసి,సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు ప్రభాకర్ అతని సోదరుని మీసేవ కేంద్రానికి వెళ్లి వచ్చినట్లు స్థానికులు తెలిపారు.మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో సోదరుడు సుధాకర్ ఇంటికి వచ్చిన సమయంలో ఒకరు బాత్రూంలో,మరొకరు బెడ్ రూమ్ లో చీరతో ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి బంధువులకు చెప్పడంతో విషయం బహిర్గతమైంది.సమాచారం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు మృత దేహాలను చీరాల ఏరియా వైద్యశాలకి తరలించారు.పోలీసులు అనుమానస్పద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.తల్లిదండ్రుల ఊసే తెలియని 13 నెలల పసిపాప మాన్విత అదమరిచి నిద్రపోతున్న దృశ్యం స్థానికులను కలచివేస్తుంది.ఈ నెల 5 వ తేదిన మాన్విత మొదటి పుట్టినరోజు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు.భార్యభర్తల ఆత్మహత్యకి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



# పారిశుద్ధ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రతి పని ప్రజలకు చేరువ కావాలి

## - జెడ్పి సీఈవో జగదాంబ

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రతి పనీ ప్రజలకు చేరువకావాలని జెడ్పి సీఈవో జగదాంబ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో జగదాంబ మాట్లాడుతూ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం చేయాలని చెప్పడం మాత్రమే కాదని పంచాయతీ స్థాయి నుంచి ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, స్వచ్ఛ రథం ద్వారా చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఇంటింటికి చేరువు కావాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి అక్కడ కూరగాయ మొక్కలు, ఆకుకూరలు వేయాలని సూచించారు. సంపద తయారీ కేంద్రం నుంచి వచ్చిన వర్మీతో మొక్కలు పెంచడం ద్వారా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించే విధానం ప్రజలకు అలవాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై ఉన్న దుమ్ము ధూళి చెత్తను శుభ్రం చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం ప్రభాకరరావు, ఎంపీడీవో వి.చంద్రశేఖరం, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేషు కార్యదర్శులు టి.రవిచంద్ర, రఘునాధ రాజు, ఎం ఆర్ సి ఎం రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# పంచాయితీ అధికారులకు పదోన్నతులు

## - తెలంగాణ సర్కార్ పచ్చజెండా

**హైదరాబాద్,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు తెలంగాణ సర్కార్ పచ్చ జెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయిలో రొటేషన్ పద్ధతిలో ఈ పక్రియ సాగనుంది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి రానున్నాయి. దీనివల్ల వేలమంది అధికారులకు లబ్ది చేకూరడమే కాకుండా, గ్రామాల్లో పాలన మరింత పటిష్టం కానుంది. అధికారులు వెంటనే ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ పనులు వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్.వి.వినోద్ కుమార్

బాపట్ల : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ ) :


జిల్లాలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో ఎలాంటి లోపాలు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.వాసుదేవ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో నిధుల వినియోగం,పనుల పురోగతిపై సమీక్ష చేపట్టి,అర్హులైన లబ్ధిదారులకు వంద శాతం ప్రయోజనం చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.నిధులు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని,జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో అమలును నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ దేబోర,జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి అబ్బులు,సీపీఓ షాలేం రాజు,డీఎంహెచ్ఓ డాక్టర్.విజయమ్మ,జిల్లా శిషు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి,గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు,పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్,డీసీహెచ్ పద్మావతి,డీఆర్డీఏ పీడీ సింగయ్య తదితరుల శాఖల అధికారులు పాల్గొన్నారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే..

దేవరకద్ర : ఏప్రిల్ 29 (ప్రజా విణక్షం )

దేవరకద్ర మండల కేంద్రంలో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగిన నరసింహారెడ్డి కూతురు వివాహ వేడుకల్లో ఆల పాల్గొని నూతన దంపతులను ఆయన ఆశీర్వదించారు. అలాగే గుడిసెల వెంకటేష్ వివాహ వేడుకల్లో పాల్గొని దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట నరసింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, చలమారెడ్డి, బాలరాజ్, సత్యం సాగర్, రాజు, కొండల్, రవి, తదితరులు పాల్గొన్నారు.





# కార్మికుల పోరాటాలకు మేడే ప్రపంచ దేశాలకు ఒక దిక్సూచి

## - ఐఎన్టియుసి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కస్తూరి రవి


ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)


రేపు జరగబోయే (1) ఫస్ట్ మేడే జెండా ఆవిష్కరణ పండగ వాతావరణంలో నిండు ఎరుపు రంగుతో జెండా ఎగరాలని ఐఎన్టియుసి అనుబంధ సంఘాలు ఘనంగా నిర్వహించాలనీ ఐఎన్టియుసి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కస్తూరి రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ప్రజల స్థితి గతులను సమీక్షించుకొని ప్రజా పోరాటాలకు ముందుండి నాయకత్వం వహించడానికి కార్మిక వర్గం పునరాంకితమయ్యే రోజు మేడే. రేపు ప్రపంచ కార్మికులు జరుపుకునే పండుగని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నాలుగు లేబర్ కోడు విధానాలను వెంటనే ఉపసంహరించు కోవాలని పాత 44 చట్టాలను యధావిధిగా కొనసాగించాలని లేని పక్షంలో కార్మికులు కన్నెర్ర చేస్తే ఎలా ఉంటుందో అమెరికా గడ్డపై చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసి ముద్దయిన మేడే జెండాను చూసి తెలుసుకోండన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ పరిశ్రమలను బ్యాంకింగ్ ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్ వంటి సంస్థలను ప్రైవేటు పరం చేస్తాననడం కేంద్ర ప్రభుత్వ విజ్ఞతకే వదిలేద్దాం ఇప్పటికైనా కార్మిక కర్షకుల మంచితనానికి బాటలు వేయాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని అన్నారు.



# జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తూ తాడేపల్లిగూడెంలో భారీ ధర్నా





తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)

జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులను, హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లిగూడెంలో జర్నలిస్టులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఎ.పి.యు.డబ్ల్యూ.జే. పశ్చిమగోదావరి జిల్లా శాఖ , తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాల వద్ద విలేకరులు భారీ ధర్నా నిర్వహించారు. ఆంధ్రజ్యోతి జర్నలిస్టు జగన్ మోహన్ రెడ్డిని హత్య. చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఐ.జే.యూ. సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి జర్నలిస్టు జగన్ మోహన్ రెడ్డి పాశవిక హత్య జరిగిన తీరు రాష్ట్రంలోనే కాకుండా దేశం మొత్తం మీద జర్నలిస్టులలో భయాందోళనలు రేకెత్తించాయన్నారు. హత్యకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు రోడ్ల మీదకు రావడాన్ని ప్రభుత్వం గమనించాలని సూచించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో నిందితునిగా ఉన్న ఒక రౌడీ షీటర్ ఈ హత్యకు పాల్పడటం చూస్తుంటే, దీని వెనుక ఏదో కుట్ర కూడా ఉన్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఈ హత్యపై ఉన్నతస్థాయి అధికారులతో లోతైన దర్యాప్తు నిర్వహించి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు గతంలో రాష్ట్ర స్థాయిలో హై పవర్ కమిటీ, జిల్లా స్థాయిలో దాడుల నివారణా కమిటీలు ఉండేవని, రాష్ట్ర విభజన అనంతరం పక్కన పెట్టిన ఆ కమిటీలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టుల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చట్టం అవసరమని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఎ.పి.యు. డబ్ల్యూ.జే. జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వెంకటగిరి కోట గ్రామానికి చెందిన జగన్మోహన్ రెడ్డి గత 20 ఏళ్లుగా విలేకరిగా పని చేస్తున్నారని తెలిపారు. ఉదయం నడక కోసం మరో పాత్రికేయ మిత్రునితో కలిసి వెళ్తుండగా నిందితులు క్రూరంగా దాడిచేసి హతమార్చారన్నారు. హత్య వెనుక చందనం స్మగ్లర్ల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. అభివృద్ధికి బ్రాండ్ ఇమేజి రావాల్సిన రాష్ట్రంలో ఒక జర్నలిస్టుకే భద్రత లేకపోవడం రాష్ట్రానికి చెడ్డపేరు తెస్తుందని వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్ ఛార్జ్ డి. రామకృష్ణ మాట్లాడుతూ వాస్తవాలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై దాడి జరగడం, హత్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య సమాజానికి తీరని హాని చేస్తుందని అన్నారు. జర్నలిస్టులపై తరచూ దాడులు జరగడం వల్ల ప్రశ్నించే గొంతులు లేకుండా పోతాయన్నారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు సతీష్ , ప్రెస్ క్లబ్ పూర్వాధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ, యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొలాటి మోషేబాబు, ఏఐటియుసి ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు తదితరులు మాట్లాడుతూ జర్నలిస్ట్ హత్యను తీవ్రంగా ఖండించారు. నిరంతరం ప్రజల్లో తిరిగే జర్నలిస్టుల భద్రతకు ముప్పు ఏర్పడటం మంచిది కాదన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని డిమాం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారి పోతురాజు కు వినతిపత్రం అందచేశారు. ఆ తర్వాత తాసిల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్ళి తహశీల్దార్ తలారి రాజా రాజేశ్వరికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ పూర్వాధ్యక్షులు చిట్యాల రాంబాబు, అడపా మాణిక్యాలరావు, పూర్వ కార్యదర్శి మైలవరపు రవికిరణ్, సీనియర్ పాత్రికేయులు షేక్ ఖాదర్ మొహీద్దీన్, తేతలి గంగాధరరెడ్డి, రొక్కం కిషోర్, యద్దనపూడి సుబ్బారావు, వానపల్లి పుండరీకాక్షుడు, పెద్దోజు మురళీ, కొడమంచిలి ఆశీర్వాదరావు, జి. ఎం.రాజు, శంకర్, కళింగ లక్ష్మణరావు , చింతకాయల దొరబాబు, శీలి మహేష్, కాసాని వెంకటరత్నం, గంటా శివ, మాడెం సతీష్, డోలా కళ్యాణ్, ప్రభుకిరణ్, సురగాల రాంబాబు, చిట్రోజు కృష్ణ , జయకృష్ణ, ఎం. కమల్ కుమార్, పాల్గొన్నారు. ఏఐటియుసి నాయకులు తాడికొండ శ్రీనివాసరావు, కొడమంచిలి చంద్రరావు, నాగరాజు , కాటమరాజు, పలువురు బ్యాంకు ఉద్యోగులు హాజరై ధర్నాకు మద్దతు ప్రకటించారు.

# బస్వాపూర్ చెక్ డ్యామ్ ని కూల్చివేతకు ప్రయత్నించిన వ్యక్తులను వెంటనే శిక్షించాలి..

## - మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి..

దేవరకద్ర : ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ )


మండల పరిధిలోని బస్వాపురం గ్రామ సమీపం దగ్గర ఉన్న చెరువు దగ్గరలో ఉన్న చెక్కు డ్యామ్ ని కూల్చి వేతకు ప్రయత్నించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. మంగళవారం అర్ధరాత్రి రా కొండ గ్రామానికి చెందిన ఇసుక మాఫియా వ్యక్తులు అక్రమంగా అడ్డదారులతో ఇసుక రవాణా చేయడానికి బస్వాపురం దగ్గర ఉన్న చెక్ డ్యామ్ ని రాత్రి కూల్చివేయడానికి ప్రయత్నించారు. రా కొండ గ్రామానికి చెందిన ఇసుక మాఫియా దుండగులు చెక్ డ్యామ్ ని కూల్చివేసి అధికారి పార్టీపై నిందలు వేయడం సరికాదన్నారు. రా కొండ గ్రామానికి చెందిన ఇసుక మాఫియా వారు ఇసుక దందా చేయడానికి రాత్రి పగలు అని తేడా లేకుండా వాగులో నీరు ఉన్నా కూడా ఇసుక తయారు చేసే మిషన్ ని తీసుకొచ్చి రాత్రి వేళలో ఇసుకను తయారుచేసి పెద్ద మొత్తంలో ఇసుకను రవాణా చేస్తున్నారు వారిపై అధికారులు పోలీసులు చర్యలు తీసుకొని చెక్ డ్యామ్ ని కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నార్లోని కుంట మాజీ సర్పంచ్ రామాంజనేయులు, హుసేనప్ప, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.



# కడియద్దలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన అమ్మవార్ల జాతర మహోత్సవం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)

తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్ద గ్రామదేవతలు మార్లమ్మ, మహంకాళమ్మ, పెద్దింట్లమ్మ పోతురాజుల జాతర మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ జాతర మహోత్సవాన్ని 12 రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారిని అత్తింటి నుంచి పూరి మేడ వద్దకు మేళతాళాలతో, గరగ నృత్యాలతో మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి జాతరకు ఆహ్వానం పలికారు. మే 10న నిర్వహించే జాతర మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించేందుకు జాతర కమిటి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మే 1న అమ్మవారి చిన్నసేవ, 8న అమ్మవారి పెద్ద సేవ, 9న బలిచేట కార్యక్రమం నిర్వహించనున్నారు. 10న అమ్మవారికి నైవేద్యాలు నిర్వహించనున్నామని జాతర కమిటీ సభ్యులు వివరించారు.



# తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా రవి కొండపల్లి ప్రమాణ స్వీకారం

## మంగళగిరి జాతీయ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం.. పాల్గొన్న ముఖ్య నేతలు

**మంగళగిరి, ఏప్రిల్ 29: ( నేషనలిస్ట్ వాయిస్)**

తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని టిడిపి రాష్ట్ర నూతన కార్యదర్శి రవి కొండపల్లి పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణ స్వీకారం అనంతరం పార్టీ కార్యకర్తలు, నేతలకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా తరగతుల్లో రవి కొండపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పోరాడే విధానం మరియు రాబోయే ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు: సానా సతీష్:రాజ్యసభ సభ్యులు

**ఆరిమిల్లి రాధాకృష్ణ: తణుకు శాసనసభ్యులు**

**ఎస్వీఎస్ఎన్ వర్మ: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే**

**దాసరి శేషు: టీడీపీ అధికార ప్రతినిధి**

పెనుబోయిన మహేష్: పార్టీ రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మరియు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ.. రవి కొండపల్లి వంటి చురుకైన నాయకులు రాష్ట్ర కమిటీలో ఉండటం పార్టీకి అదనపు బలమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మరియు అధికార ప్రతినిధి దాసరి శేషు ఆయనకు శుభాకాంక్షలు



తెలియజేశారు."పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కార్యకర్తలకు అండగా ఉంటూ తెలుగుదేశం జెండాను ఎగురవేయడమే నా ప్రథమ కర్తవ్యం." అంటూ రవి కొండపల్లి, రాష్ట్ర కార్యదర్శి తెలిపారు.అంతేకాకుండా ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు తమ్ముడు పెనుబోయిన మహేష్ తదితరులు పాల్గొని రవి కొండపల్లిని ఘనంగా సన్మానించారు.

# హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌ను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని, నేర నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, జనరల్ డైరీ, రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలని, ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలతో మరింత సత్సంబంధాలు పెంచుకోవాలని, ముఖ్యంగా యువతకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని సూచించారు. డీసీపీ వెంట సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, గోవర్ధన్ ఉన్నారు.








# బొర్రంపాలెంలో చిట్లూరి నాగేశ్వరరావు దశదిన కార్యక్రమం

## - నివాళులర్పించిన టిడిపి నాయకులు శీలం వెంకటేశ్వరరావు

**బొర్రంపాలెం, ఏప్రిల్ 29: ( నేషనలిస్ట్ వాయిస్)**

గ్రామ ప్రముఖులు చిట్లూరి నాగేశ్వరరావు దశదిన (దశ-దిశ) కార్యక్రమం బుధవారం స్థానిక గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాగేశ్వరరావు చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు.అలాగే ఈ కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరరావు తో పాటునైనారపు జలపాలు (గ్రామ సర్పంచ్) స్థానిక పార్టీ నాయకులు గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తికోసం కన్నకూతురు ఘాతుకం తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి నిప్పు

## - ప్రమాదం నుంచి బయటపడ్డ దంపతులు

**పల్నాడు,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)**

చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి కోసం కూతురు కన్నతల్లిదండ్రుల ఇంటికే నిప్పు పెట్టింది. వారు చనిపోవాలని చూసింది. అదృష్టవశాత్తు వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆస్తి వివాదం కారణంగా తల్లిదండ్రులపై కూతురు కర్కశంగా వ్యవహరించింది. కన్న తల్లిదండ్రులను కూతురు చంపాలని చూడటం చర్చనీయాంశంగా మారింది. చిలకలూరిపేటకు చెందిన తల్లిదండ్రులు, కూతురికి మధ్య ఆస్తి విషయాల్లో తరచూ గొడవలు జరుతున్నాయి. ఆస్తిని ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో కోపం పెంచుకున్న కూతురు.. వారి ప్రాణాలు తీయడానికి సిద్ధమైంది. గత రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టింది. మంటలను గుర్తించిన తల్లిదండ్రులు సకాలంలో ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంటలు వ్యాపించడంతో ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కూతురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

# టీ నర్సాపురం మండలాభివృద్ధిపై 'చిర్రి బాలరాజు' కీలక చర్చలు

## - బర్రింకలపాడు క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్య నాయకులతో సమాలోచనలు

**టీ నర్సాపురం, ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్):**

ఏలూరు జిల్లా టీ నర్సాపురం మండలాన్ని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత చిర్రి బాలరాజు అడుగులు వేస్తున్నారు. బుధవారం బర్రింకలపాడులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన మరియు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తమ తమ పరిధిలోని ప్రజా సమస్యలను బాలరాజు దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ లభించింది.

**పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ సమావేశంలో జనసేన పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు మరియు మార్కెట్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు: జట్ల సత్యనారాయణ (జనసేన సీనియర్ నాయకులు, పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్)తొమ్మిదేళ్ల శ్రీనివాస్ (పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్)చింతలపూడి నవీన్ పింగుల మధు రామకృష్ణ మండల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుండి అందాల్సిన ఫలాలను చేరవేయాలని నాయకులకు బాలరాజు దిశానిర్దేశం చేశారు.



# డిజిటల్ అరెస్ట్ మోసాలపై జాగ్రత్త వీడియో షేర్ చేసిన మంత్రి పెమ్మసాని

**అమరావతి,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)**

డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. పోలీసు అధికారులుగా నటిస్తూ, సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఇలాంటి నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక వీడియోను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'డిజిటల్ అరెస్ట్ మోసాలతో జాగ్రత్త!. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు లేదా ప్రభుత్వ ప్రతినిధులుగా నటిస్తూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజ్ఞాత కాల్స్, సందేహాస్పద లింకులు, ఓటీపీలు ఎప్పటికీ షేర్ చేయకండి. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించండి లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. స్మార్ట్‌గా ఉండండి, సురక్షితంగా ఉండండి. ఒక్క క్లిక్ మీ భవిష్యత్తును మార్చొచ్చు. జాగ్రత్తగా ఆలోచించండి' అని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# హసన్ పర్తి మండలం పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



దోమ అర్పిత హాల్ టికెట్ నం 2612109030జెడ్ పి హెచ్ ఎస్ వంగపహాడ్ 545 /600

హసన్ పర్తి మండలంలో పదవ తరగతి ఫలితాలు విశేషంగా నమోదయ్యాయి. మండలంలో మొత్తం ఉత్తీర్ణత శాతం 99.08గా నమోదై, జిల్లాలో నాలుగవ స్థానాన్ని సాధించడం గర్వ కారణంగా నిలిచింది. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో 8 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి మొత్తం 37 పాఠశాలల్లో 26 పాఠశాలలు శాతం 100 ఫలితాలు సాధించాయి. ఈ సంవత్సరం మండలంలో మొత్తం 1867 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా, అందులో 1852 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలలో జడ్పిహెచ్ఎస్ వంగపహాడ్ పాఠశాలకు చెందిన డి. అర్పిత 545 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది.జెడ్‌పీహెచ్ఎస్ వంగపహాడ్, దేవన్నపేట, హసన్ పర్తి బాలుర పాఠశాల, మల్లారెడ్డి పల్లి, ముచ్చర్ల, పెగడపల్లి, సీతంపేట, సిద్ధాపూర్ పాఠశాలలు 100% ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచాయి. కేజీబీవీ హసన్ పర్తి లో పరీక్ష రాసిన 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100% ఫలితాన్ని నమోదు చేశారు.గురుకుల పాఠశాలల్లో టీఎస్ ఆర్ఎస్ హసన్ పర్తి బాలికల పాఠశాలకు చెందిన కే.రోహిణి ప్రియ 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రత్యేక తరగతులు విద్యార్థులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ ముఖ్య కారణమని మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ తెలిపారు. తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను గమనించి, రాబోయే విద్యా సంవత్సరంలో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల లో చేర్పిస్తే మెరుగైన ఫలితాలు సాధించగలమని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని ఆయన అన్నారు.



కొమ్ముల రోహిణి ప్రియ హాల్ టికెట్ నం 2612102214 టిజి రెస్ హసన్ పర్తి ఎర్రగట్టు గుట్ట. 580/600

# ఆకివీడు రామాలయ కేసు డిస్పోజ్ చేసిన హైకోర్టు

**అమరావతి,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

ఆకివీడు రామాలయంపై వేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు డిస్పోజ్ చేసింది. ఇదే అంశంపై ఇప్పటికే హైకోర్టులో మరో బెంచ్ ముందు రిట్ పిటిషన్‌తో పాటు కోర్టుధిక్కరణ పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉన్నాయని కోర్టు తెలిపింది. అక్కడే తేల్చుకోవాలని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ పిల్‌ను ముందుగా డిస్మిస్ చేస్తామని హైకోర్టు చెప్పగా.. పిల్ తరఫున హాజరైన న్యాయవాది శ్రవణ్ కుమార్ డిస్పోజ్ చేయాలని అభ్యర్థించారు. దీంతో పిల్‌ను డిస్పోజ్ చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ధర్మాసనం ప్రకటించింది.

# వరంగల్ కలెక్టరేట్ లో హెల్త్ క్యాంప్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ జిల్లాలో జిల్లా కలెక్టరేట్ లో బుధవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల కాకతీయ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్ లో పనిచేస్తున్న జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఈ హెల్త్ క్యాంపులో సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా ఈసీజీ, రక్త పరీక్షలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి వారి ఆరోగ్య స్థితిని వైద్యులు పరిశీలించారు. ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించాలంటే అధికారుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ రెవెన్యూ సంధ్యారాణి, విజయం సూపర్డెంట్ హరిచంద్ర రెడ్డి వైద్య బృందం, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# పోలవరం కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

- నిర్వాసిత కుటుంబాలను వెంటనే కాలనీలకు తరలించాలి
- గ్రామసభలు నిర్వహించి 'పీసా' కమిటీల ఆమోదం పొందాలి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం

**ఏలూరు, ఏప్రిల్ 29:( నేషనలిస్ట్ వాయిస్)**

పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి పోలవరం నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం, భూ పరిహారం, మరియు వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల భూసేకరణపై అధికారులతో ఆమె జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం చివరి దశలో ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "వేసవి కాలం నిర్మాణ పనులకు అత్యంత అనుకూలమైన సమయం. కాబట్టి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి, నిర్వాసిత కుటుంబాలను వెంటనే కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలి," అని స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తయి, వినియోగంలో లేకపోవడం వల్ల ఏవైనా ఇళ్లకు మరమ్మత్తులు అవసరమైతే వాటిని కూడా తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

**పీసా కమిటీల అనుమతి తప్పనిసరి**

నిర్వాసితులకు 'భూమికి భూమి' పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. భూసేకరణ సమయంలో సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, తప్పనిసరిగా పీసా కమిటీల అనుమతి పొందాలని అధికారులకు సూచించారు. అలాగే, నూజివీడు ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, ఐటిడిఏ పీఓ రాములు నాయక్, ఆర్డీఓ రమణ, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మరియు సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# బాణావతు జయంత్ - లలితల వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 29: ( నేషనలిస్ట్ వాయిస్)**

జంగారెడ్డిగూడెం పట్టణంలోని 'కె కన్వెన్షన్' హాల్‌లో బుధవారం జరిగిన బాణావతు వారి వివాహ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. నూతి రామన్నపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణావతు శ్యాంబాబు - లక్ష్మి దంపతుల కుమారుడు జయంత్, వధువు లలితల వివాహానికి హాజరైన బాలరాజు, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు స్థానిక నాయకులు, బంధుమిత్రులు మరియు బాణావతు కుటుంబ శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకకు విచ్చేసిన తెల్లం బాలరాజు కి బాణావతు శ్యాంబాబు కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికి, కృతజ్ఞతలు తెలియజేశారు.



# రైతు సభ నిర్వహణకు స్థలాల పరిశీలన

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి తాటికొండ రాజయ్య,
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్,
- మాజీ శాసన సభ్యులు ఆరూరి రమేష్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో మంగళవారం రోజున నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ పేరిట చేసిన మోసాన్ని గుర్తుచేస్తూ మే 6న వరంగల్‌లో సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు బుధవారం హనుమకొండ లోని కేడీసీ, కుడా, ఆర్ట్స్ కళాశాల మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ మే 6న వరంగల్‌లో రైతు సభ ను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిక్లరేషన్ల పేరిట రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ప్రకటించి మూడేళ్లు గడిచినా వాటి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ రవీందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ డిక్లరేషన్లను ప్రకటించిన చోటే వాటి అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని అన్నారు. రాహుల్ గాంధీని వరంగల్ కి తీసుకొచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ సర్కారు వంచించిందని తెలిపారు.

రైతు ద్రోహి రేవంత్ రెడ్డని, రైతు వ్యతిరేకి అని విమర్శించారు. మాజీ మంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రెండున్నరేండ్లు గడిచినా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. రుణమాఫీ చేయలేదని, రైతుబంధు రావడం లేదని, కొనుగోళ్లు చేపట్టడం లేదని అన్నారు.

మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండ గట్టేందుకు రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ లోనే మే 6న బీఆర్ఎస్ భారీ రైతు సభ నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించిందని తెలిపారు.

కేసీఆర్ రైతులకు మేలు చేస్తే రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎరువుల కొరత, రైతుబంధు ఎగవేత, రుణమాఫీలో కోతలు తప్ప రేవంత్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని అన్నారు.



# అత్యాచార బాధిత మహిళకు భరోసా

## - కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న శైలజ

**అమరావతి,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)**

విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం ఈ ఘటనలో బాధిత మహిళకు రాయపాటి శైలజ వీడియో కాల్ చేసి.. ఫోన్‌లో పరామర్శించారు. న్యాయం చేస్తామని ఈ సందర్భంగా బాధితురాలికి రాయపాటి శైలజ హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రాయపాటి శైలజ.. బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో నివసిస్తున్నారు. గత ఆదివారం సాయంత్రం వివాహిత విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించింది. గుర్తు తెలియని వ్యక్తి జనరల్ బోగిలో ఉన్న ఆమెను ఏసీ బోగిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత మహిళ.. రెంటచింతల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం ఆమెను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ అత్యాచార ఘటన బహిర్గతం కావడంతో ఈ ఘటనపై రెంటచింతల పోలీసులతో మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు రాయపాటి శైలజ సూచించారు.

# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత - 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు
- ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్..హైదరాబాద్ లాస్ట్

**హైదరాబాద్,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)**

తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా స్జబెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

## - హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బిఎల్ వో సూపర్వైజర్లు, బిఎల్ఓలతో సమీక్షా సమావేశం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



హనుమకొండ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ప్రక్రియ ను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ, పురోగతి గురించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని పరకాల వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో పూర్తి చేసిన ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పరిశీలించారు. మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడంపై అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర కార్యక్రమం జిల్లాలో ప్రస్తుతం 65. 67 శాతంగా ఉందని, దానిని 10 రోజుల్లో 90 శాతానికి తీసుకువచ్చే విధంగా మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ ఐ ఆర్ అనుసంధాన ప్రక్రియలో భాగంగా 2002 ఓటర్ల జాబితాతో ఓటర్లు తమ పేరు, తల్లిదండ్రులు, లేదా తాతల ఓటు వివరాలను పరిశీలన చేసుకుని అట్టి వివరాలను బీఎల్వోలకు అందజేయాలని ఓటర్లను కోరారు. అనుసంధానం కోసం ప్రతి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కాలనీ పెద్దలు, సంఘాల నాయకుల తో సమావేశం ఏర్పాటు చేసి ఎస్ఐ ఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించి ఎస్ఐఆర్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎస్ఐ ఆర్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, ఈఆర్వోలు/ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఏఈఆర్ఓలు/ తహసిల్దారులు, బిఎల్ వో సూపర్వైజర్లు, బిఎల్వోలు పాల్గొన్నారు.

# ముందున్నది మండుటెండల కాలం మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే

హైదరాబాద్,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)

రాష్ట్రంలో భానుడు ప్రచండ భానుడిగా మారాడు. ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయటకు వస్తే మాడి మసైపోతారా అన్నట్లుగా ఎండలు దంచి కొడుతున్నాయి. మేలో మరింత తీవ్రంగా ఎండలు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. రోహిణి కార్తె రాకముందే నిప్పులు కురిపిస్తున్నాడు. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నా రాష్ట్రంలో పలుచోట్ల చండప్రచండగా ఎండలు మండుతున్నాయి. దీంతో ఉదయం 9గంటలు దాటిన తర్వాత బయటకు రావాలంటే జనం బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలుల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ప్రమాదస్థాయికి చేరినట్టు హెచ్చరించింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, 12 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది. 2016 ఏప్రిల్ 26న మంచిర్యాల జిల్లా దండేపల్లిలో నమోదైన 48.8 డిగ్రీల తర్వాత ఈ నెలలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని పేర్కొన్నది. దీంతో ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని వివరించింది. ప్రజలకు బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రతలు తీసుకోవాలని కోరింది. ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కరిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఢిల్లీతో సహా 21 రాష్ట్రాలకు జాతీయ మానవ హకుల కమిషన్ పలు కీలక సూచనలు చేసింది. వృద్ధులు, గర్భిణులు, పిల్లలతోపాటు ఉపాధిహామీ కూలీలపై ఈ ఎండల ప్రభావం అధికంగా ఉంటుందని హెచ్చరించింది. అలాంటి వారి రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరింది. 2019 నుంచి 2023 మధ్య కాలంలో వడదెబ్బ వల్ల 3,712 మంది మరణించినట్టు గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హీట్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి, బలహీనవర్గాలకు మంచినీరు, ఆశ్రయం, వైద్య సహాయం అందించాలని సూచించింది.

# తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

## - విమాన ధరలతో ప్రయాణఙకులక వెనకడుగు

## - భక్తులు తగ్గడంతో శ్రీవాణి టిక్కెట్లపై ప్రభావం

తిరుపతి,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)

విమాన ప్రయాణ ధరలు తిరులమ భక్తులపై పడింది. గల్ఫ్ యుద్ధంతో భారీగా పెరిగిన విమాన ధరల కారణంగా తిరుపతికి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఈ ప్రభావం శ్రీవాణి టిక్కెట్లపైనా పడింది. తిరుపతి విమానాశ్రయంలో ఒకటిన్నర నెలలుగా శ్రీవాణి ట్రస్టు దాతలకు జారీ చేసే టికెట్లు మిగిలిపోతున్నాయి. రోజూ 40 శాతానికిపైనే టికెట్లు జారీ చేయకుండానే కౌంటర్‌ను మూసివేయాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ రోజూ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800, విమానాశ్రయంలో 200 చొప్పున శ్రీవాణి టికెట్లను జారీ చేస్తోంది. ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసే 800 టికెట్ల కోటా క్షణాల్లో పూర్తవుతుంటే విమానాశ్రయంలో జారీ చేసే 200 టికెట్లలో సగానికిపైగానే మిగిలిపోతున్నాయి.
గతంలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి హైదరాబాదు నుంచి తిరుపతికి ఐదు విమాన సర్వీసులు నడిచేవి. ఈక్రమంలో మధ్యాహ్నం 11 గంటలకే 200 టికెట్ల కోటా విక్రయాలు పూర్తయ్యేవి. ఇటీవల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. విమాన టికెట్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రయాణికుల రాకపోకలు చాలావరకు తగ్గిపోయిన క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. సాధారణంగా శ్రీవాణి టికెట్లు కలిగిన భక్తులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. ఈక్రమంలో రెండు గంటల ముందు అంటే మధ్యాహ్నం రెండు గంటలకు విమానాశ్రయంలోని కౌంటర్‌ను మూసివేస్తున్న క్రమంలో రోజూ 50 నుంచి 100 టికెట్లు మిగిలిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 22వ తేదీ వరకు పరిశీలిస్తే 4,400 టికెట్లు అందుబాటులో ఉంచితే 2,980 విక్రయం కాగా, 1420 మిగిలిపోయాయి. తాజాగా మంగళవారం కూడా 90 టికెట్లు విక్రయం కాగా, 110 టికెట్లు మిగిలిపోయాయి. మామూలుగానే శ్రీవాణి టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈక్రమంలో మిగిలిన టికెట్లను ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా కేటాయిస్తే మిగిలిన భక్తులు వినియోగించుకుంటారని, లేదా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు విపరీతమైన ఒత్తిడి నెలకొంటున్న సమయంలో సిఫార్సులపై కేటాయించినా ఈ టికెట్లు వృథా కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సోనమ్‌కు బెయిల్‌పై సవాల్

## - మేఘాలయ హైకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం

భోపాల్,ఏప్రిల్29( నేషనలిస్ట్ వాయిస్)

సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్‌కి బెయిల్ ఇవ్వడంపై సవాల్ చేయాలని రఘువంశీ కుటుంబం నిర్ణయించింది. సోనమ్‌కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించ నున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు మెమోలో సెక్షన్ 403(1) అని ప్రస్తావించారు. బీఎన్ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేదు. సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అరెస్టు మెమోలోనే కాకుండా.. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించ డాన్ని మేఘాలయ కోర్టు గుర్తించింది. సాంకేతిక తప్పిదమనే పోలీసుల వాదనలను తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. దీంతోపాటు సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి గాజీపుర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేక పోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనమ్‌కు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. గతేడాది మే 11న అతడికి సోనమ్ తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వీరు కన్పించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమే భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, వీరిలో ముగ్గురికి ఇప్పటికే బెయిల్ లభించింది.

# మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

## - టంప్‌కు బిట్రన్ రాజు ఛార్లెస్ చురకలు

వాషింగ్టన్,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)

బ్రిటిష్ వారు లేకపోతే అమెరికా ప్రజలు ఫ్రెంచ్ మాట్లాడాల్సి వచ్చేదంటూ బ్రిటన్ రాజు ఛార్లెస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎద్దేవా చేస్తూ చురకలు అంటించారు. మంగళవారం రాత్రి అధ్యక్ష కార్యాలయంలో జరిగిన స్టేట్ డిన్నర్‌లో ఆయన సరదాగా మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సహాయం చేయకపోతే యూరోపియన్ దేశాల ప్రజలు జర్మన్, జపనీస్ మాట్లాడేవారని ట్రంప్ గతంలో అన్న మాటలను బ్రిటన్ రాజు గుర్తుచేశారు. 'అధ్యక్షా.. అమెరికా లేకపోతే యూరోపియన్ దేశాలు జర్మన్ మాట్లాడేవని మీరు ఇటీవల వ్యాఖ్యానించారు. నేనేం చెబుతున్నానంటే ఒకవేళ మేము లేకపోతే, మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారు' అని చార్లెస్ చమత్కరించారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్య్రం రాకముందు.. ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. లండన్–వాషింగ్టన్ మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాన్ని కొనియాడారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. స్టేట్ డిన్నర్‌లో అద్భుతమైన ప్రసంగం చేసినందుకు బ్రిటన్ రాజును అభినందించారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తమకు మద్దతిచ్చేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ముందుకు రాకపోవడాన్ని విమర్శించారు.



# అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం

- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ దాదాపుగా ఇదే అంచనా- ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వశర్మకే ప్రజల ఓటు

గౌహతి,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)

అస్సాంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని విజయాన్ని నమోదు చేసుకోబోతోంది. బీజేపీ వరుసగా హ్యాట్రిక్ విజయం అందుకోనుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీజేపీ 85 నుంచి 95 సీట్లు గెలుచుకోనుందని మాట్రిజ్ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. కాంగ్రెస్ పార్టీ 25 నుంచి 32 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. కాగా, బీజేపీ 88 నుంచి 98 సీట్లు గెలుచు కుంటుందని, కాంగ్రెస్ 22 నుంచి 32 సీట్లు, ఇతరులు 3-5 సీట్లు గెలుచుకుంటారని చాణక్య స్ట్రాటజీస్ అంచనా వేసింది. 'పీపుల్స్ పల్స్' సైతం బీజేపీకే పట్టం కట్టింది. బీజేపీ 68-72, కాంగ్రెస్ 22-26, ఏజీపీ 7-10, బీపీఎఫ్ 8-9 సీట్లు గెలుచుకుంటాయని తెలిపింది. 'పల్స్ టుడే' అంచనా ప్రకారం బీజేపీకి 88-92 సీట్లు, కాంగ్రెస్‌కు 29-32, ఇతరులకు 4-6 సీట్లు వస్తాయి. ఎస్ఏఎస్ గ్రూప్ సైతం బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని తెలిపింది. బీజేపీ 84-90, కాంగ్రెస్ 40-60, ఇతరులకు 2-3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. యాక్సిస్ మై' ఇండియా సైతం బీజేపీ క్లీన్ స్వీప్ సాధిస్తుందని ఢంకా బజాయించింది. ఎన్డీయేకు 88 నుంచి 100 సీట్లు వస్తాయని తేల్చిచెప్పింది. కాంగ్రెస్ కూటమికి 24 నుంచి 36 సీట్లు రానున్నట్టు తెలిపింది. 48 శాతం ప్రజలు ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వ శర్మ వైపు మొగ్గుచూపుతుండగా, 32 శాతం ఓటర్లు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొంది. కాగా, అస్సాంలో ప్రభుత్వం ఏర్పాటుకు 64 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 9న జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 85.38 శాతం పోలింగ్ నమోదైంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. బెంగాల్ ఎన్నికలు ముగియడంతో బుధవారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి.

# పోలీస్ యూనిఫామ్‌లో రీల్స్

- దొంగపోలీస్ రవిని అరెస్ట్ చేసిన పోలీసులు- ఒంగోలుకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

హైదరాబాద్,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)

పోలీస్ యూనిఫాంలో సెక్యూరిటీ కళ్లు గప్పి తెలంగాణ సచివాలయం లో రీల్స్ చేసి అందరినీ గందరగోళపర్చిన సుడో పోలీస్‌ను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడు ఏపీలోని ఒంగోలుకు చెందిన రవి అలియాస్ నిఖిల్ యాదవ్‌గా గుర్తించిన సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఫ్యామిలీతో హైదరాబాద్ కు వచ్చిన రవి.. సచివాలయంలో సెక్యూరిటీగా డ్యూటీ చేస్తున్నాను..సీఎం రేవంత్ రెడ్డిని కలవాలంటే నాకు ఫోన్ చేయండి అంటూ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేశాడు. నెట్టింట వీడియో వైరల్ కావడంతో పెద్ద దుమారం రేగింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతను సచివాలయంలో సెక్యూరిటీ కాదని .. ఓ సాధారణ వ్యక్తి అని.. కేవలం రీల్స్ చేసి వైరల్ అవడం కోసం ఇలా చేశాడని పోలీసులు గుర్తించారు. ఆ రీల్స్ చేసింది ఒంగోలు రవి అలియాస్ నిఖిల్ యాదవ్ గా గుర్తించారు. ఫ్యామిలీ తో కలిసి సచివాలయంలో ఫొటోలు దిగుతామని సెక్యూరిటీని బతిమలాడి లోనికి వెళ్లినట్లు గుర్తించారు. తర్వాత సచివాలయం ప్రాంగణంలో రీల్స్ చేసి సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. రవి చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో పోలీసులు షాక్ తిన్నారు. రవికోసం ఆరా తీసిన పోలీసులు అతని అడ్రసు, వివరాలు సేకరించారు. చివరికి అతన్ని పట్టుకున్నారు. అప్పటికే రవిపై చీటింగ్ కేసుతోపాటు ఐటీ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. బుధవారం రవి అలియాస్ నిఖిల్ యాదవ్ ను అరెస్ట్ చేశారు.

# దర్శకుడు, జర్నలిస్ట్ రఘురామ్ హఠాన్మరణం

హైదరాబాద్,ఏప్రిల్ 29 ( నేషనలిస్ట్ వాయిస్)

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుంది. ప్రముఖ దర్శకుడు, సీనియర్ జర్నలిస్ట్ బండి రఘురామ్ ( 56) కన్నుమూశారు. హైదరాబాద్ మధురానగర్ లో నివాసముంటున్న ఆయన.. మంగళవారం వాకింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే బంధువులు, సన్నిహితులు ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బండి రఘురామ్ కేవలం సినీ దర్శకుడే కాదు. జర్నలిజంలో ఎం.ఫిల్, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. లిబియన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన, సినిమాలపై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగాన్ని వదిలి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ప్రముఖ దర్శకుడు సానా యాదిరెడ్డి వద్ద 'పిట్టలదొర', 'బ్రహ్మచారి' వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పనిచేసి దర్శకత్వ మెళకువలు నేర్చుకున్నారు. 2004లో శివాజీ, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన 'వరం' చిత్రంతో రఘురామ్ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించక పోయినప్పటికీ, దర్శకుడిగా ఆయన ప్రతిభను చాటుకుంది. ఆ తర్వాత పలు చిత్రాలకు రైటర్‌గా, ఘోస్ట్ రైటర్‌గా తన సేవలను అందించారు. ఇటీవల మళ్ళీ మెగాఫోన్ పట్టేందుకు ప్రయత్నాలు చేస్తూ, స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సినిమాల్లోకి రాకముందు, వచ్చాక కూడా రఘురామ్ జర్నలిజం రంగంలో చురుగ్గా ఉండేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఈటీవీ, వీ6 వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ముఖ్యంగా ఆయన ఇచ్చే సినిమా రివ్యూలకు, విశ్లేషణలకు పాఠకుల్లో మంచి గుర్తింపు ఉండేది. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు, జర్నలిస్ట్ మిత్రులు దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేస్తున్నారు. రఘురామ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకేసారి అటు సినీ రంగంలో, ఇటు మీడియా రంగంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు

- ఎంత సీనియర్ అయినా పట్టించుకోను
- ప్రజలకోసం పాటుపడుతూ..పార్టీ కోసం కష్టపడాల్సిందే
- దేశంలో అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ టిడిపి
- పార్టీ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు లోకేశ్ విశేష కృషి
- సామాన్య మహిళా కార్యకర్తకు పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించాం
- వచ్చే ఎన్నికల్లో ఇప్పటికన్నా రెట్టింపు ఓట్లు రాబట్టుకునేలా కృషి
- టిడిపి కార్యవర్గ ప్రమాణస్వీకారంలో చంద్రబాబు పిలుపు

అమరావతి,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)





తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, రాష్ట్ర పురోగతికి కృషి చేసిన వారికే పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని తెలుగుదేశం అధ్యక్షుడు , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీనియారిటీ ఉంటే పదవులు రావని, సిన్సియార్టీతో పనులు చేసేవారిని ఆదరిస్తామని అన్నారు. తనకు అత్యంత దగ్గర వారైనా కప్పు కాఫీ ఇచ్చి పంపుతానే తప్ప, పార్టీ పదవులు అప్పగించి తప్పు చేయనని స్పష్టం చేశారు. తాను గుడ్డిగా ఎవరికీ బాధ్యతలు అప్పగించనని, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేవారినే ప్రోత్సహిస్తానని చంద్రబాబు నాయుడు తేల్చి చెప్పారు. బలమైన కేడర్ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. దేశంలో టీడీపీలాగా క్రమశిక్షణ కలిగిన పార్టీ ఎక్కడా లేదని అభిప్రాయపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగాచంద్రబాబు మాట్లాడుతూ..'కార్యకర్తే అధినేత అనే మన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిద్దాం. లోకేష్ పార్టీలో ప్రక్షాళన తెచ్చి కార్యకర్తలకు బీమా కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ మనం బలపడాలి. వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ రావాలి. అన్ని సమీకరణలు చూసి కార్యవర్గాన్ని ఎంపిక చేశాం. సీనియారిటీ, సిన్సియారిటీ, కమిట్‌మెంట్ చూసి పదవులకు ఎంపిక చేశాం. 4 దశాబ్దాలుగా కమిటీలను నియమిస్తున్నాం. కానీ, ఇంతవరకు ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. సీనియర్లను గౌరవిస్తూ కొత్తవారికి అవకాశం ఇచ్చాం. ఒక మండల పార్టీ నేతను పొలిట్ బ్యూరో మెంబర్‌ను చేశాం. సామాన్య కార్యకర్తలకు పార్టీలో పదవులొచ్చాయి' అని అన్నారు. ఒక్క ఓటమితోనే రాజకీయ పార్టీలు చాపచుట్టేస్తున్నాయి. గెలిచినా.. ఓడినా.. సగర్వంగా ఎగిరే జెండా పసుపు జెండా. 44 ఏళ్లలో అనేక సంక్షోభాలు, సవాళ్లను చూశాం. పసుపు జెండా పౌరుషం ఎప్పుడూ తగ్గలేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో అధికంగా రావాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తే అధినేత అనేది మన సిద్ధాంతం.. ఆచరణలో చేసి చూపించాం అని చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ కొనసాగుతుందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలే అసలు బలం అని పేర్కొన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మెలేస్తారని, ఎవరికీ తలవంచరని అన్నారు. నూతన కమిటీలను ఎన్నో వడపోతలు, వ్యూహాలతో ఏర్పాటు చేశామని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా విధానంగా మార్చుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, మహిళా బిల్లుకు పూర్తిగా మద్దతు ఇచ్చామని చెప్పారు. చదువుకున్న వారికి మంత్రి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు చంద్రబాబు.. రామ్మోహన్ నాయుడు, శబరి, రాజేష్ వంటి యువ నాయకులను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని, ట్రైనింగ్ క్లాసులు నుంచి కార్యకర్తల సంక్షేమం వరకు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో లోకేష్ కృషి చేస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి రావడానికి లోకేష్ కృషే కారణమని పేర్కొన్నారు. ఆయన సామర్థ్యాన్ని గుర్తించి వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. అది పదవి కాదని, అత్యున్నత బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో టీడీపీ బలం పెరగాలని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే మరింత ఎక్కువ ఓట్లు సాధించాలని పిలుపునిచ్చారు. గతంలో కార్యకర్తలు ఎదుర్కొన్న కష్టాలు తనకు గుర్తున్నాయని అన్నారు టీడీపీ అధినేత చంద్రబాబు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర సహకారంతో గట్టెక్కిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఒక్కో అడుగు ముందుకు వేస్తూ వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని అన్నారు. నిలిచిపోయిన కేంద్ర పథకాలను పునరుద్ధరించామని, అప్పులను రీషెడ్యూల్ చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ప్రజలకు వాట్సాప్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా సెంటర్ సహా పలు ఐటీ సంస్థలను తీసుకువచ్చి విశాఖపట్నాన్ని టెక్ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.ప్రత్యర్థి పార్టీపై కూడా చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి నిధులు వస్తుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు కలిగించడంలో ప్రత్యర్థి పార్టీ ముందుంటుందని విమర్శించారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కుట్రలకు ఇక కాలం చెల్లిందని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ చేస్తున్న విధ్వంసాన్ని అనునిత్యం ప్రజలకు చెప్పాలని అన్నారు. కిల్లింగ్ మనస్తత్వంతో ఉన్న పార్టీకి సంక్షేమం పట్టదని.. అభివృద్ధి అంటే గిట్టదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు తీసుకువస్తుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని.. అయినప్పటికీ ప్రభుత్వంపై విశ్వాసంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. ప్రత్యర్థి పార్టీ కుట్రలకు ఇక కాలం చెల్లిందన్నారు. 'ఓసీడీ అనేది ఓ వ్యాధి.. గొడ్డలి పార్టీకి ఇప్పుడు సీసీడీ వ్యాధి సోకింది. క్రెడిట్ చోరీతో గొడ్డలి పార్టీ అనారోగ్యానికి గురైంది. వీళ్లని ఇలాగే వదిలేస్తే.. దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చామని చెబుతారు. ఆపరేషన్ సిందూర్‌కు డ్రోన్లు కూడా ఇచ్చామని గొడ్డలి పార్టీ చెప్పేలా ఉంది. ఫేక్ ప్రచారంతో మనకే అనుమానం వచ్చేలా చేయడంలో గొడ్డలి పార్టీ ముందుంటుందని అంటూ సీఎం చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# తెలుగుదేశం కార్యవర్గ ప్రమాణ కార్యక్రమం

- పాతకొత్తల కలయికతో పలువురికి పదవులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లోకేశ్

అమరావతి,ఏప్రిల్29 ( నేషనలిస్ట్ వాయిస్)



తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధినాయకత్వం పాత, కొత్త నాయకుల కలయికతో కమిటీలను ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. టీడీపీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం విశేషంగా మారింది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేస్తూ, కష్టపడి పని చేసిన నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కూడా కొత్త ఉత్సాహం కనిపించేలా టీడీపీ హైకమాండ్ కమిటీలను నియమించింది. సీనియర్ నాయకుల అనుభవాన్ని, జూనియర్ నాయకుల దూకుడును సమపాళ్లలో కలిపి కమిటీలను రూపొందించారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి కూడా హైలెట్‌గా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో చురుకుగా పని చేసిన పలువురికి కూడా కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వడం గమనార్హం. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్న కాలంలోలాగే, ఈసారి కూడా సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక బాధ్యతల్లో కొనసాగు తున్నారు. ఈ కొత్త కార్యవర్గంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# కులమేదైనా హిందువులంతా ఐక్యంగా ఉండాలి

- సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి - ఆరోగ్య భారతి(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) క్షేత్ర సంఘటనా కార్యదర్శి అమ్మినేనికుమారస్వామి

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

కులమేదైనా హిందువులందరూ ఒకటి గా, ఐక్యంగా ఉండాలని ఆరోగ్య భారతి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ) క్షేత్ర సంఘటనా కార్యదర్శి అమ్మినేని కుమారస్వామి పిలుపునిచ్చారు. కరీంనగర్లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్ లో గణేష్ నగర్ బస్తి హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వేల, లక్షల సంవత్సరాల చరిత్ర కలిగిన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలన్న హిందువులందరూ కులాలకు అతీతంగా ఐక్యం ఉండాలన్నారు. వేద పండితులు, బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సాంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. పిల్లలకు విద్యతో పాటు పురాణాలు , రామాయణం, మహాభారతం, భగవతగీతా గ్రంథాలను , నైతిక విలువలను బోదించాలని చెప్పారు . మహిళా వక్త కామారపు మంజుల కుటుంబం లో మహిళలు, బాలికలు మన సాంప్రదాయాలను పాటించాలని కోరారు. లవ్ జిహాద్ బారిన పడకుండా యువతులను రక్షించుకోవాలని, అన్య మతస్తుల నుండి తలెత్తే ప్రమాదాల నుండి హిందువులను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కోరారు. ఈ సమ్మేళనం లో గణేశనగర్, హనుమాన్ నగర్, తిరుమల నగర్, బాలాజీ నగర్, దోబి వాడ, ఎన్జీవో స్ కాలనీ నుండీ దాదాపుగా మూడు వేల మంది ప్రజలు పాల్గొన్నారు. గణేష్ నగర్ బస్తి హిందూ సమ్మేళనం అధ్యక్షులు పొన్నం మల్లయ్య గౌడ్, కార్యదర్శి హన్మాండ్ల రాజిరెడ్డి, కార్పొరేటర్ లు కొలిపాక రమ్యశ్రీ, నలువాలా పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు 28 మందిని సన్మానించారు.




## బీరంగూడలో చలివేంద్రం ప్రారంభించిన కాట శ్రీనివాస్ గౌడ్

**అమీన్పూర్ / నేషనలిస్ట్ వాయిస్ :**

బీరంగూడ డివిజన్ పరిధిలోని ఐక్యత హోమ్స్ వద్ద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తీవ్ర వేసవి పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనాన్ని అందించడమే కాకుండా, సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.




## మానవత్వానికి బాసటగా కష్టాల్లో ఉన్న కుటుంబానికి

- ఆసరాగా ఉదారతకు మంచికి మానవత్వానికి అండగా నిలుస్తున్న వేములపల్లి కృష్ణార్జునరావు

**( నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ 29, పినపాక ప్రతినిధి**

అశ్వాపురం : ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన ఎస్సీ కాలనీకి చెందిన గద్దల బద్రమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది అనే విషయాన్ని తెలుసుకున్న వేములపల్లి కృష్ణార్జునరావు వెంటనే స్పందించి దశదినకర్మలకు బియ్యం 50 కేజీ.. ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు ఈ కార్యక్రమంలోగద్దల రామకృష్ణ, చెట్టిపల్లి శేఖర్. చుంచు సందీప్,కొమ్ము రాంబాబు, మడిపల్లి రమేష్ గద్దల చందు. గణేష్, గద్దల బంగారం, మురికిపూడి వెంకటేశ్వర్లు. కత్తి కృష్ణ, గిద్దె నర్సింహా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన మార్గదర్శకాలు

**తిరువూరు, నేషనలిస్ట్ వాయిస్**

గ్రంథాలయాలు విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మార్గదర్శకంగా పనిచేస్తాయని గ్రంథాలయ నిర్వాహకురాలు కే పద్మావతి అన్నారు. బుధవారం నాడు తిరువూరు గ్రేడ్ వన్ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల శిబిరంలో భాగంగా ఉపాధ్యాయులు నాగేశ్వరరావు విద్యార్థులకు చిత్ర లేఖనం నేర్పించారు . అలాగే గంపలగూడెం గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వహకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. తెలుగు దస్తూరి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు శ్రీ షిరిడి సాయిబాబా కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు పంచారు.




## నూతన పివో ను కలిసిన పర్ధన్ పురోహిత్ సంఘం నాయకులు

**దండేపల్లి ఏప్రిల్-29( నేషనలిస్ట్ వాయిస్ )**


నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరం ను బుధవారం గిరిజన ఆదివాసీ పర్ధన్ పురోహిత్ సేవా సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాము మొక్క అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈసందర్భంగా జిల్లాలో ఆదివాసుల అభివృద్ధి మరియు జీవనశైలి పై చరించారు ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మెస్రం మనోహర్ మాట్లాడుతూ ఆదివాసీ తొమ్మిది తెగలాల్లో పర్ధన్ తెగ అభివృద్ధికీ ఆమడ దూరంలో ఉందని మీ పరిపాలనలో నైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని కోరారు ఈకార్యక్రమంలో మెస్రం శేష్ నారాయణ రాష్ట్ర ఉపాఅధ్యక్షులు ఆడాయి కాంతారావు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పెంద్రం తిరుపతి ఉపాఅధ్యక్షులు పార్చాకి సుధాకర్ గేడం నిరంజన్ సిడ్మికీ సుభాష్ మెస్రం రవి పాల్గొన్నారు



## రూ.300 కోట్ల ఉపాధి హామీ బకాయిల విడుదల

- ఎంపీడీవో ముత్యాల రావు

**( నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ 29, పినపాక ప్రతినిధి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం: రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న రూ.591 కోట్లకు గాను రూ.300 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసినట్లు ఎంపీడీఓ ముత్యాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 300 కోట్లు విడుదల కాగా మరో రూ.291 కోట్ల నిధులను త్వరలో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సమాచారం ఇచ్చిందన్నారు . గత జనవరి 17 నుంచి రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు వేత నాలు నిలిచిపోగా ఈ విషయాన్ని మంత్రి సీతక్క ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్లో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం పెండింగ్ నిధుల్లో రూ.300 కోట్ల మేరకు విడుదల చేసిందనీ కేంద్రం విడుదల చేసిన నిధులు కూలీల ఖాతాల్లో బుధవారం జమకానున్నాయన్నారు. వేతనాల విడుదల దృష్ట్యా ఉపాధి హామీ పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకురాలు దివ్యా దేవరాజన్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులను ఆదేశించారనీ మండలం లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు ఉపాధి హామీ పనుల ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థులు

**నెక్కొండ 29 ఏప్రిల్ నేషనలిస్ట్ వాయిస్**

నెక్కొండ మండల కేంద్రంలోని పీఎం ఎస్ హెచ్ ఆర్ ఐ తెలంగాణ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన 2026 విద్య సంవత్సరము పదవ తరగతి ఫలితాలలో గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 600 మార్కులకు గాను తుమ్మల వర్షిత 580, వేముల హాసిని 577, గూళ్ల రిషిక 572, గడ్డి అర్చన 571, కిసరి ప్రణిత 570 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

## నేరస్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి ఈ టీం ఏఎస్ఐ పంకజ

**శంషాబాద్. ఏప్రిల్ 29. నేషనలిస్ట్ వాయిస్.**

నేరస్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఒంటరిగా ఉన్న సమయంలో ప్రయాణాలు చేసే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని శంషాబాద్ షీ టీం ఎస్ఐ పంకజ సూచించారు. శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు . మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్మానుష్య ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అలాంటి సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ యాప్ లను వినియోగించుకోవాలని పంకజ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు డిప్యూటీ ఎమ్మార్వో వాణి, హెడ్ కానిస్టేబుల్ రాఘవేందర్, కానిస్టేబుల్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.




## జనగణనలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనండి: ఎమ్మెల్యే జిఎంఆర్

**పాటన్ చెరు / నేషనలిస్ట్ వాయిస్**

జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్చెరులోని తన నివాసంలో స్వీయ జన గణనను ప్రారంభించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని.. ఖచ్చితమైన వివరాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం సమర్థవంతమైన సంక్షేమ పథకాలు రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించడం ద్వారా జనగణన ప్రక్రియ మరింత సులభతరమైందన్నారు. ప్రజలు యాప్ ద్వారా స్వీయ జనగణన సైతం చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు ఇళ్లకు వచ్చిన సమయంలో పూర్తి వివరాలు అందించాలని.. ఎటువంటి గోప్యతకు చోటు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా బడుగు బలహీన వర్గాల జీవన స్థాయి ప్రమాణాలు, వెనుకబాటుతనం, విద్య స్థాయి, తదితర అంశాల పైన స్పష్టమైన సమాచారం లభిస్తుందన్నారు. ప్రజలు అందించే ప్రతి సమాచారం పూర్తి భద్రతతో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఏ ఆర్ ఓ అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## మండల కేంద్రంలో ఘోర ప్రమాదం

- ఏటూరు నాగారం వాసి దుర్మరణం

**ఏప్రిల్ 29, పినపాక ప్రతినిధి.**

అశ్వాపురం: మండల కేంద్రంలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఆర్ & బి గెస్ట్ హౌస్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు డివైడర్ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై ఈరోజు తెల్లవారుజామున జరిగిన ప్రమాద సంఘటనలొ ఏటూరునాగారం నుండి విజయవాడ కు వెళుతున్న కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నట్లు,దానిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని ఒకరు డ్రైవర్ కాగా అతనికి ఊపిరితిత్తులలో బలమైన దెబ్బ తగలగా మరొకరికి గర్భిణీస్త్రీకి తీవ్ర రక్త స్రవం కాగా, ఒకరు అక్కడికక్కడే మరణించారని సమాచారం శత గాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డివైడర్ పై వెలుతురు లేని కారణం అయి ఉండొచ్చని మరియు అతి వేగంకూడా అని స్థానికులు వాహనదారులు అంటున్నారు. ఈ ఘటనలో ఏటూరు నాగారం ప్రాంతానికి చెందిన తిరుమల శెట్టి వీర్రాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని స్థానికులు భావిస్తున్నారు.







# పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓటమి



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. 223 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. లీగ్ ఆరంభమైన నెల రోజులకు ఈ జట్టు తొలి ఓటమిని రుచి చూసింది. గత మ్యాచ్‌లో 265 పరుగుల లక్ష్యం ముందున్నా పంజాబ్ కింగ్స్ విజయాన్ని వదిలిపెట్టలేదు. కానీ మంగళవారం రాజస్థాన్ చేతిలో ఓటమి పాలైంది. బ్యాటింగ్‌లో సత్తా చాటిన రాయల్స్ 223 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వీ జైస్వాల్ (51; 27 బంతుల్లో 7ఐ4, 1ఐ6), వైభవ్ సూర్యవంశీ (43; 16 బంతుల్లో 3ఐ4, 5ఐ6) జట్టుకు గట్టి ఇన్నింగ్స్? అందించగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డొనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6ఐ4, 3ఐ6) విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. రియాన్ పరాగ్ (29; 16 బంతుల్లో 2ఐ4, 2ఐ6), శుభమ్ దూబె (31 నాటౌట్; 12 బంతుల్లో 3ఐ4, 2ఐ6) పరుగులు చేశారు. మొదట పంజాబ్ 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. స్టొయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4ఐ4, 6ఐ6), ప్రభ్‌సిమ్రన్ (59; 44 బంతుల్లో 6ఐ4, 1ఐ6). లక్ష్యం పెద్దదైనప్పటికీ ప్రణాళికతో ఆడిన రాయల్స్ సులువుగా విజయాన్ని ఛేధించింది. వైభవ్ సూర్యవంశీ ఛేదనలో జట్టుకు బలమైన పునాది వేశాడు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో మొదటి బంతికి యశస్వి సింగిల్ తీస్తే రెండు బంతులు డాట్స్ ఆడిన వైభవ్ చివరి మూడు బంతులకు 6, 4, 4 తో ఓవర్? ముగించాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లోనూ మొదటి బంతికి జైస్వాల్ సింగిల్ తీస్తే వైభవ్ తరువాత రెండు బంతులకు పరుగులు తీయలేదు. కానీ చివరి 3 బంతులకు 4, 6, 6 కొట్టేశాడు . చూస్తుండగానే 40 పరగులు చేసిన అతను, అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్లో ఔటైనప్పటికీ రాయల్స్ స్కోరు వేగం మాత్రం తగ్గలేదు. సూర్యవంశీ ఔటయ్యాక జైస్వాల్ క్రీజులోకి వచ్చి భారీ షాట్లు ఆడాడు. పవర్‌ప్లేలో రాయల్స్ 84/1తో నిలిచింది. ఈ దశలో స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్, చాహల్ పొదుపుగా బౌలింగ్ వేశారు. చాహల్ వరుస ఓవర్లలో జురెల్ (16), యశస్విలను ఔట్ చేసి రాయల్స్‌పై ఒత్తిడి పెంచాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న పరాగ్ వికెట్? సైతం చాహల్‌లే తీశాడు. అయితే 6 ఓవర్లలో 72 పరుగులు చేయాల్సిన పరిస్థితిలో ఫెరీరా రాజస్థాన్? రాయల్స్‌కు హీరోగా మారాడు. పంజాబ్ ప్రధాన బౌలర్లు అర్ష్‌దీప్, ఫెర్గూసన్, యాన్సెన్‌లను గట్టిగా ఎదుర్కొన్న అతను భారీ షాట్లతో మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శుభమ్ దూబె సైతం భారీ షాట్లు ఆడడంతో రాయల్స్ పని తేలికైపోయింది. చివరి ఓవర్ రెండో బంతికి సిక్సర్ బాదిన ఫెరీరా మ్యాచ్‌ను ముగించడంతో పాటు అర్ధశతకం పూర్తి చేశాడు.



# ఆ 'ఏఐ చిప్'ని దేవుడే నా బ్యాట్‌లో ఫిక్స్ చేశాడు

రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది అసాధారణ ఫామ్‌లో ఉన్నాడు. 9 మ్యాచ్‌ల్లోనే 400 పరుగులు సాధించి ప్రస్తుతం 'ఆరెంజ్ క్యాప్' రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ముఖ్యంగా 238.09 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ జస్ప్రీత్ బుమ్రా, జోష్ హేజిల్‌వుడ్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్‌ను చీల్చి చెండాడుతున్నాడు. ఈ క్రమంలోనే ఐపీఎల్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో (167 బంతులు) 400 పరుగుల మైలురాయిని అందుకున్న ఆటగాడిగా వైభవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. వైభవ్ ఆడుతున్న అద్భుతమైన షాట్లను చూసి పాకిస్థాన్ క్రికెట్ విశ్లేషకుడు నౌమాన్ నియాజ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. వైభవ్ బ్యాటింగ్‌ను చూస్తుంటే అతనిలో ఏదో మ్యాజిక్ ఉందని, బహుశా అతని శరీరంలో లేదా బ్యాట్‌లో 'కృత్రిమ మేధస్సు' (ఏఐ) చిప్ అమర్చి ఉండవచ్చని సరదాగా వ్యాఖ్యానించాడు. "ఈ అబ్బాయి అసాధారణంగా ఆడుతున్నాడు. డోపింగ్ పరీక్షలు చేసినట్లే, ఇతనిని ఏదైనా ప్రయోగశాలకు పంపి పరీక్షించాలి. బహుశా శరీరంలో ఏఐ చిప్ ఉందేమో" అని నియాజ్ పేర్కొన్నాడు. 18 ఏళ్లు నిండకముందే ఇంతటి శక్తివంతమైన షాట్లు ఆడటం అసాధ్యమని ఆయన కొనియాడాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 16 బంతుల్లో 43 పరుగులు చేసిన తర్వాత, నౌమాన్ నియాజ్ చేసిన ఈ 'ఏఐ చిప్' వ్యాఖ్యలపై వైభవ్ స్పందించాడు. దీనికి అతను నవ్వుతూ సమాధానమిస్తూ.. "ఆ చిప్‌ను దేవుడే స్వయంగా నా బ్యాట్‌కు అమర్చి పంపాడు. నేను పుట్టకముందే పైనున్న దేవుడు నా బ్యాట్‌లో ఏదో ఒక శక్తిని పెడుతున్నానని చెప్పాడు, ప్రస్తుతం నేను దాన్నే వాడుతున్నాను" అని బదులిచ్చాడు. ఈ సమాధానం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ సీజన్‌లో వైభవ్ కేవలం 167 బంతుల్లోనే 400 పరుగులు పూర్తి చేసి, గతంలో ఆండ్రీ రసెల్ (188 బంతులు), అభిషేక్ శర్మ (195 బంతులు) పేరిట ఉన్న రికార్డులను తిరగరాశాడు. 15 ఏళ్ల వయసులో పరిణతి చెందిన ఆటతీరును ప్రదర్శిస్తున్న వైభవ్, భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణంగా మారుతున్నాడు.

## చెపాక్ దేశంలోనే అత్యంత చెత్త వేదిక
## ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్



ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీ తరపున ఆడుతూ అదరగొట్టేస్తున్న ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తాజాగా చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో పెనుదుమారం రేపుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో భారత్‌లోని వివిధ క్రికెట్ స్టేడియాలకు ర్యాంకులు ఇవ్వాలని ఆయనను కోరగా.. చెన్నై సూపర్ కింగ్స్ హోమ్ గ్రౌండ్ అయిన ఎం.ఏ. చిదంబరం స్టేడియం (చెపాక్)ను దేశంలోనే అత్యంత చెత్త వేదికగా పేర్కొన్నాడు. ఒకప్పుడు తను కూడా ఇదే చెన్నై జట్టుకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. తన ర్యాంకింగ్స్‌లో దానికి చివరి స్థానం ఇవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. సాధారణంగా చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు అనుకూలంగా ఉండి, తక్కువ స్కోర్లు నమోదయ్యే వేదికగా పేరుగాంచింది. అయితే ఓ స్టార్ పేసర్‌గా హేజిల్‌వుడ్‌కు అక్కడి పరిస్థితులు ఏమాత్రం నచ్చలేదని స్పష్టమవుతోంది. "బ్లైండ్ ర్యాంకింగ్" ప్రక్రియలో భాగంగా స్టేడియాల పేర్లు అడగగా.. చెన్నై మైదానాన్ని అతను ఏమాత్రం సంకోచించకుండా పదో స్థానంలో (చివరి స్థానం) ఉంచాడు. స్పిన్ మాయాజాలం ఎక్కువగా ఉండే ఈ పిచ్‌పై పేసర్లకు పెద్దగా పని ఉండకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. మరోవైపు బ్యాటర్లకు స్వర్గధామంగా, బౌలర్లకు పీడకలగా భావించే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియాన్ని హేజిల్‌వుడ్ తన ఫేవరెట్ వేదికగా మొదటి స్థానంలో నిలిపాడు.

# ఆసియా క్రీడలకు సన్నద్ధమవుతోన్న భారత క్రికెట్ జట్టు

జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడల కోసం భారత సెలెక్టర్లు కసరత్తులు ప్రారంభించారు. ప్రధాన జట్టు అంతర్జాతీయ సిరీస్‌లలో బిజీగా ఉండటంతో, ఈ మెగా టోర్నీకి యువ ఆటగాళ్లతో కూడిన జట్టును పంపనున్నారు. తాజా నివేదికల ప్రకారం, టీమ్ ఇండియా కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్, వైస్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026లో వీరిద్దరూ ప్రదర్శించిన నాయకత్వ పటిమ, బ్యాటింగ్ నైపుణ్యం సెలెక్టర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.భారత జట్టు నాయకత్వ బాధ్యతలకు శ్రేయాస్ అయ్యర్ అత్యంత అనువైన వ్యక్తిగా కనిపిస్తున్నారు. దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో కోల్‌కతా వంటి జట్లను విజయవంతంగా నడిపించిన అనుభవం అతనికి ఉంది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం అయ్యర్ ప్రత్యేకత. యువ క్రీడాకారులకు దిశానిర్దేశం చేస్తూ, జట్టును ఐక్యంగా ఉంచగల సామర్థ్యం అతనికి అదనపు బలం. అనుభవం, స్థిరత్వం ప్రాతిపదికన సెలెక్టర్లు అయ్యర్ వైపు మొగ్గు చూపుతున్నారు.మరోవైపు, ఇషాన్ కిషన్ తన దూకుడైన ఆటతీరుతో, నాయకత్వ లక్షణాలతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలిక సారథిగా వ్యవహరించినప్పుడు అతను తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు ప్రశంసలు పొందాయి. వికెట్ కీపింగ్ చేస్తూ మైదానాన్ని అంచనా వేయడంలో కిషన్ దిట్ట. జట్టులో ఉత్సాహాన్ని నింపుతూ, కీలక సమయాల్లో ఫలితాలను రాబట్టగల సత్తా ఉన్నందున అతన్ని ఉప-నాయకుడిగా ఎంపిక చేసే అవకాశం ఉంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించడమే లక్ష్యంగా బీసీసీఐ ప్రణాళికలు రచిస్తోంది. జపాన్ వేదికగా జరిగే ఈ టోర్నీలో యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటుకునేందుకు ఇది ఒక గొప్ప వేదిక. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రతిభావంతులైన ఆటగాళ్లతో ఈ జట్టును నిర్మించనున్నారు. అధికారిక ప్రకటన ఇంకా రానప్పటికీ, అయ్యర్, కిషన్ ద్వయం భారత జట్టును విజయపథంలో నడిపిస్తారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తు భారత క్రికెట్ నాయకత్వాన్ని సిద్ధం చేసే దిశగా ఇది ఒక కీలక అడుగు కానుంది.





# వారణాసికి ప్రపంచ మార్కెట్ పక్కా ప్రణాళికతో చిత్ర బృందం అడుగులు

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు. రాజమౌళి వీడియో సందేశంతోపాటు, 'వారణాసి' తెరవెనక సన్నివేశాల్ని అందులో ప్రదర్శించారు. తదుపరి బ్రెజిల్‌తోపాటు మరిన్ని దేశాల్లోనూ 'వారణాసి' సినిమాని ప్రచారం చేయనున్నట్టు తెలుస్తోంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఓ పాటని తెరకెక్కించారు. మే తొలి వారం నుంచి హైదరాబాద్‌లోనే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. కథానాయకుడు మహేశ్ ఇతర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




# పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.






# బుర్ర తక్కువై..హనుమాన్ వదులుకున్నా నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.

# యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి.విశ్లేషకులు భావిస్తున్నారు.







# నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్

టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయానికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది.థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మరోసారి ఈ యాక్షన్ ప్రేమకథను ఆస్వాదించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656